# ఆదివారం

"నువ్వు సేస్తావా నన్ను సెయ్యమన్నావా?"

"...................."

"కాదు. నువ్ సేస్తానంటే – నీ యిల్లు నువ్వు తీసుకో. నేఁప్పోతే నా కొదిలీ. అంతేకాని, పెందిలొక్క బురూ మాపటొక్కబురూ, ఆలముందొక మాటా, నా ముందొక మాటా, అయితే నా నొప్పను".

"...................."

"సెప్పు. నువ్ సేస్తావా?"

"నా న్సెయ్యనేకే గదా నీ కొప్పగించినాను"

"ఐ త్తిన్నగెల్లు. మల్ల నా గుమ్మఁవెక్కినావా – కాల్లిరిసేస్తాను".

– ముసిలి సూరమ్మ వెళ్ళిపోవలసిన దారేదో చూపించి తోముతూ తోముతూ విడిచిన అంట్ల దగ్గరకెళ్ళి కూర్చుంది – అంకాలు.

నూద్దగ్గిర మొహం కడుక్కుంటున్న దాన్ని అలాగే సబ్బు మొహంతో కూర్చుండిపోయేను.

సూరమ్మ కూడా బొమ్మలా నిల్చుండిపోయింది.

అంకాలు గొంతు విన్నారేమో మా అత్తగారు బయటకు వచ్చేరు.

"ఇదే! తీరు!! వచ్చిన రెండు మూడురోజులు ఏం వందనార్దంగా ఉందో ఉందే. ఆ తరవాత ఇలానే హళ్ళూ హళ్ళూ అంటూ మీదపడిపోతోంది. నువ్వు ఆర్నెల్లు మాదొడ్లో పన్జేసేపు. ఎప్పుడేనా నోళ్ళు చేసుకోడం ఎరుగుదుమే?"

సూరమ్మ పల్లెటూరి మనిషి. వయసు అరవై ఏళ్ళ పైనుంటుంది. పట్నంలో చాలాకాలమై ఉంటున్నా ఆమె అలవాట్లు ఏమీ మార్చుకోలేదు. ఆమె కుడిపైట వేస్తుంది. ఆ పైటను ఎడం భుజం మీంచి ముందుకు లాక్కొని, అందులో జొనిపిన ఎడం చేయి గడ్డంకింద చేర్చి, చోద్యం గమనిస్తున్నట్టు నిల్చుంది.

ఆమె తాటస్థ్యాన్ని తమతో ఏకీభావంగా తీసుకొని మా అత్తగారు తమ ఫిర్యాదు వివరాలు అందుకున్నారు.

"పనిలో ప్రవేశించాక వారం రోజులు ఏం వచ్చిందో ఏం వచ్చిందో నాగాలు పెట్టకండా వచ్చిందే. ఆదివారం పనికి రాలేదు. ఏఁవే – అంటే – 'రాత్తిరి రెండో ఆట సినీమాకెళ్ళేను. ఉదయం తెలివి రాలేదు. మధ్యాహ్నం నిద్దరొచ్చింది' అంది. ఏదో చిన్న గుంట అనుకున్నాను. మళ్ళా ఆదివారం కూడా పనికి రాలేదు. ఏఁవంటే – 'ఒంట్లో బాగులేదంది' మూడో ఆదివారం మానేసి అడిగితే ఆదివారాలు రానంది.

అదేమే! లోకంలో ఎక్కడా లేని ఆచారం నువ్ కొత్తగా తెచ్చిపెడుతున్నావ్. పనిమనుషులు ఒక కాల్నొస్తేనో, చెయ్యినొస్తేనో నాగా పెడతారుగాని తీరికూర్చుని శలవులను భవిస్తారే – అన్నాను.

దానిమీద–

'అక్కడలాగ, ఇక్కడిలాగ ఉద్యోగాలు చేసే మీ మొగాళ్ళు ఏ సంకటాలూ లేకండానే శలవుపెట్టి జీతాలు తీసుకోడం లేదా? కాఫీ హోటేళ్ళూ, కొట్లూ కట్టేయాలని గవర్నమెంటు రూలు పాస్చేసింది – పనోళ్ళకు ఒకరోజు శలవుండాలనే కదా?' అంటూ బారెడు చదివింది.

ఓహో అలాగా! అయితే నిన్నుకూడా శలవు తీసుకోమని రూలు పేసు చేసే రేఁవిటే, అలాగని నేనెక్కడా వినలేదు – అన్నాను.

ఆ మాటకు కఁయ్యి... మంటూ–

'నిజంగా కాయకష్టం చేసుకునే వాళ్ళ, కష్టాలు యీ గవన్మెంటు కెప్పుడు పట్టాయి; మాకు వాళ్ళూ వీళ్ళూ రూలు పెట్టేదేఁవిటి; మేఁవే పెడతాం రూల్సు', అంటూ నేనాదివారాలు రానంది.

సరే. నీ రూల్సు నువ్‌పెట్టు. నా రూల్సు నే పెడతాను. నువ్వు నాగాలు పెట్టిన రోజులికి నేను జీతాలు కోసేస్తాను – అన్నాను.

అదటే. అదీ – దానికి తప్పొచ్చింది.

'అత్తరి బొబ్బా అల్లరి బొల్లా! మీ జాతలాటిది. మీ నీతలాటిది. మీకైతే ఒక రూల్సంటారు. మాకైతే ఒక రూల్సంటారు. లోకఁవంతా మీలాటి మనుషులేనని మీరేనాడు ఒప్పుకున్నారు' అంటూ ఆశిరమ్మంత గొంతు పెట్టుకొని ఆకాశమంత ఎత్తు లేచిపోయింది.

చెప్పొద్దూ – నాక్కోపమొచ్చింది. ఒసే నీకిష్టముంటే పన్చెయ్. లేదన్నావూ మానుకో. అంతేకాని నా దొడ్లో నోరు చెయ్యడానికి వల్లకాదన్నాను.

అంతే నేనన్నది. కావలిస్తే అడుగు. అద్దముంది, ముఖముంది. అంతకు మించి నేనొక్క పొల్లు మాటన్లేదు".

"దానికి రుజువులూ సాచ్చికాలూ దేనికమ్మా! కావలిసొచ్చినా అదేటి కలకటేరా గవినేరా – నాలాగే పన్జేసుకునే కూలిముండ. దాన్తో సెప్పుకుంటే ఏటౌతాది? ఓ యిరుగమ్మనో, పొరుగమ్మనో నీసాటిదాన్ని పిలిస్సెప్పితే కసింత అందంగుంటాది" అన్నది అంకాలు.

మా అత్తగారికి దాని విసురు అర్థమైనట్టుంది.

"న్యాయం చెప్పడానికెవరైతే యేమే? దానికి నీవారైనా ఒకటే, నా వారైనా ఒక్కటే. న్యాయం చెప్పవలసి వచ్చినప్పుడు యెవరైనా ఒకపక్షమే చెప్పగలరు. దానిమాటకేం గాని యిటు వినే" అంటూ సూరమ్మ నుద్దేశించి మళ్ళా చెప్పడం ఆరంభించేరు.

'పన్లో కొచ్చిందంటే ఒక్క ఘడియైనా గుర్రాన్ని కట్టదుగదా. పడెయ్యండి! 'పడెయ్యండి! నాకు టైమైపోతోంది. నాకు టైమైపోతోంది! –' ఇలా వెల్లలు లేచేస్తుంది. ఎలాగే ఇంకా భోజనాలు కాలేదనో, చేతిలో పనుందనో అంటామా – 'నాకు మీ యిల్లొక్కటే అనుకున్నారా, ఒక్కొక్కింటికీ మూడేసి నాలుగేస్సార్లు తిరగడానికి నాకింక పనుల్లేవనుకున్నారా?' అంటుంది.

టైము గురించి అంత నిక్కచ్చిగా ఉండాలనే మనిషి తనో వేళకి సరిగ్గా వస్తుందంటే అదీ లేదు. ఒకనాడు తెల్లవారకముందే వచ్చేస్తుంది. ఇంకోనాడు బారెడు పొద్దెక్కితేగాని దర్శనాలుండవు. ఇంక మధ్యాహ్నమైతే సరేసరి. ఉదయమల్లా ఒళ్ళు హూనం చేసుకొని భోజనాలయాక ఇలా సాగోరతాం – అలాటివేళ చూసుకొని తలుపులు దబదబా బాదేస్తుంది.

ఒసే సూరమ్మా! పనిమనిషి నెందుకే పెట్టుకుంటాము? కాస్త హాయీ, విశ్రాంతీ ఉండాలనే కదా! ఉదయానికి ఉదయం నిద్రచెడి, మధ్యాహ్నానికి మధ్యాహ్నమూ నిద్రకి నోచుకోకపోతే పనిమనిషిని పెట్టుకున్న సుఖమేముందో నువ్వే చెప్పు" అంటూ ఆగేరు అత్తగారు.

"ఔనమ్మా! యాళా పాళా నిద్దర్లూ సుకాలూ మీకే వుండాల. పొద్దూకులూ యండనక, వాననక, రెక్కలు ముక్కలు సేసుకునే వోళ్ళం – మా నిద్దర్ల సంగతేటో మా సాదక బాదకాలేటో మీకు పట్టవు. పనికెట్టుకున్న అందరమ్మలకీ వోకిళ్ళూ కల్లాపులూ, అంట్లూ, సెంబులూ అన్నీ పొద్దు పొడవకముందే అయిపోవాల. బలబల తెల్లారితే గాని ఒకమ్మా మొగుడు పక్కిడిసి బయటికి రాదు. అందరి పన్లూ ఆ ఒక్క గంటలోనే సేసీడానికి మాకేం పచ్చేతులూ, పది కాళ్ళూ ఉంటాయేటమ్మా? ఉన్నా అందరిళ్ళల్లోనూ ఒక్కపాలే పన్జేసీడానికి మావేం దేవతలంవా?"

అంకాలు ఎత్తిపొడుపుకి మా అత్తగారు చాతనైనంతలో తొందర పడకుండానే జవాబిచ్చేరు.

"మీరు దేవతలైతే మీ చేత పన్చేయించుకుంటారటే? కాళ్ళు కడిగి నెత్తిన జల్లుకొని పూజలే చేస్తురు. మీరూ మాలాటి మనుషులు కాబట్టే మీ చేత పన్చేయించుకోడం, మాక్కలిగింది తృణమో పణమో ముట్టచెప్పి మీ రుణం తీర్చుకోడం జరుగుతోంది. ఏమేనా అంటే, ఇదుగో ఈ అమ్మ కలిగినమ్మ కాబట్టి కలిగినమ్మలా మాటాడుతోంది – అంటావు కాని అంత తలకి మించిన భారాలు నెత్తినేసుకోవడం దేనికి, 'మోయలేక నలిగి పోవడం దేనికి? చాతనైన మట్టుకే మాట పడకుండా చేసుకోగలిగే మేరకే పనులు ఒప్పుకోరాదా. డబ్బు చాలకపోతే ఆ ఒప్పుకున్న ఇళ్ళల్లోనే ఇంకో అర్ధో, పావలో అడుక్కోవచ్చు".

అయినా అంకాలు రయ్యి...మంది.

"నిన్నూ నిన్నూ అడుక్కోడానికీ, నీ కాళ్ళూ నీ కాళ్ళూ పట్టుకు పిసకరించ డానికీ నాకేం పట్టిందమ్మా. నానేం అవిటి దాన్నా, సెవిటిదాన్నా? నేకపోతే వొళ్ళొంచడాని కొల్లని సోఁ వారి పోతునా? కష్టపడతాను. తెచ్చుకున్న కూరాకు తింటాను. అంవాసకో పున్నానికో ఎంగిలి మెతుకులెడతారని ఎవరి కాళ్ళూ పిసకరించను.

నా కిష్టం వున్నదా – యిష్టంవున్నకాడ యిష్టంవున్నన్నాళ్ళు పన్జేస్తాను. నా కిష్టం లేపోతే నాను పన్జెయ్యను."

"మానియ్యే అయితే మానియ్" అంటూ మా అత్తగారు కూడా రెచ్చిపోయేరు. "నన్నేం బెదిరిస్తావా? మురిపిస్తావా? నీకిష్టం లేపోతే మానీ". అని నోరు చేసుకోవడానికి యిష్టపడని మనిషి కావడం వల్ల –

"సూరమ్మా! నువ్వు రేపణ్ణుండే వచ్చి పన్లో చేరే. ఆ యెక్కువివ్వ వల్సిన రూపాయో అర్ధో నువ్వే తీసుకుందువు గాని" అంటూ పూరా శాంతించేసేరు.

కొంతసేపు ఎవరూ మాటాళ్ళేదు. ఆ తరవాత అంకాలు అకస్మాత్తుగా అడిగింది. ఇంతసేపూ ఆమె అంట్ల గిన్నెలు తోముతూనే మాటాడుతోంది.

"అందుకేనేటమ్మా దాన్ని రమ్మన్నారూ?"

"అవునందుకే."

కడుగుతూ కడుగుతూ ఉన్న గిన్నె కడిగి బోర్లించింది. గబగబా చేతులు కడిగేసుకుంది. కడిగేసుకున్న చేతులు నింపాదిగా తుడుచుకుంటూ ఇవతలికి వచ్చింది. ఇంకా కడగవలసిన గిన్నెలు రెండు మూడుండి పోయేయి. వాటి వంక వేలుతో చూపిస్తూ

"ఎల్లే, ఎల్లి కడుగు". అంది సూరమ్మతో.

సూరమ్మ కదల్లేదు.

"ముసిలి ముండా! నాలి ముచ్చు ఏసికాలూ, నంగిరి పింగిరి మాటలూ ఎక్కణ్ణేర్సినావే? పన్జెయ్యడాని కొచ్చిన లంజివి పన్జెయ్" అంటూ రెక్క పట్టుక తోసింది సూరమ్మను.

కొంచెం ముందుకు తూలిన సూరమ్మ నిల్దొక్కుకొని నిలబడుతూ గంయ్‌మంది.

"యిదేటోలమ్మ! నా మీదడిపోతావ్. ఆ యమ్మ రమ్మని

కబురెడితే అదెందుకోనని నానొచ్చినాను. యిలాగని తెలిస్తే రాకనే పోదును".

అని వెనక్కి తిరిగి–

"ఇంటికి బిలిసి యిడుఁవుళ్ళెడతారని నాకేం దెలుసూ" అంటూ మా అత్తగారి దగ్గర శలవైనా తీసుకోకుండా వెళ్ళిపోయింది.

ఆమె గేటు దాటిందాకా నిలబడి మేమక్కడ ఉన్నట్టయినా గమనించకండా అంకాలు మళ్ళా తన పనిలో ప్రవేసించింది.

పాపం మా అత్తగార్ని చూస్తే నిజంగా జాలేస్తుంది. ఇంకా అక్కడుండడం కష్టమనిపించి నేను ఇంట్లోకొచ్చేశాను.

బొట్టు పెట్టుకుంటుంటే "ముండ చచ్చినాళ్ళు ఎంత నేర్చేరు!" అంటూ, గదిలో కొచ్చేరు. "వీళ్ళ కట్టులో సగం కట్టుంటే మనం ఏనాడో బాగుపడుదుం" అన్నారు కచ్చెగా.

పావుగంట తరవాత అంకాలు కేకేసింది–

"యిదిగో నమ్మోయ్! యిట్రండి"

తోమి బోర్లించిన ఇత్తడి గిన్నెలు వంటింటి ముందు తళతళ లాడుతున్నాయి. ఆ గుమ్మంలో నేనూ, గదిత గుమ్మంలో మా అత్తగారూ నిల్చుని ఉన్నాం.

"నెలాకరు యీ యాల్టికి సరీగ్గా నాల్రోజులుంది. వొచ్చీ నెలకి ఆ సూరమ్మనే యెట్టుకుంటారో యింకో పారమ్మనే యెట్టుకుంటారో నాకు తెల్దు. నాను మాత్రం ఒకటో తారీకు నుండి పన్లోకి రాను" అంటూ తిరిగైనా చూడకుండా వెళ్ళిపోయింది.

★ ★ ★

మూడ్రోజులు, నేనూ మా అత్తగారూ, చివరకు మా ఆడబిడ్డ కూడా – ఎన్ని లజ్జుగుజ్జులు పడ్డామో ఆ భగవంతుడికే తెలియాలి. మా అత్తగారు పడ్డ పాట్లయితే యిక చెప్పనలవి కాదు.

ఇంటికొచ్చే పాలవాళ్ళతోనూ, కూరలవాళ్ళతోనూ చెప్పేము. నూనె పోసే రాములమ్మ చెవినీ, నేతి మామ్మ చెవినీ వేసేము.

"నీ ఎరికని ఎక్కడైనా మంచి పనిమనిషుంటే చూస్తూ" అంటూ దారిని పోయే తెలిసిన వాళ్ళనూ, తెలియని వాళ్ళనూ ఎందరెందరినో అర్థించేరు అత్తగారు. ఎన్నడూ గుమ్మం దాటని మనిషి – పనికట్టుకుని చుట్టపక్కాల యిళ్ళకెళ్ళి భోగట్టాలు చేసేరు. మా ఆడబడుచు కోసం వచ్చే కాలేజీ అమ్మాయిల్ని కూడా విడిచిపెట్టలేదు.

"ఓయమ్మ యిదేం కాలమే! పనిమనిషి దొరకడఁవే బ్రహ్మాండమై పోతోంది" అన్నారు – మొదటి రోజున.

"పదులూ పదిహేన్లూ దర్శించుకోవడమేకాక, కాఫీ ఫలహారాలు నైవేద్యం పెట్టాలిటే" అన్నారు రెండో రోజున.

మూడోరోజు–

"అవతల వీధిలో ప్లీడరుగారి పనిమనిషుందంటే వెళ్ళేను చూద్దామని. దానికన్న మన మానేసిన ముసిలి సూరమ్మ లక్షరెట్లు నయ్యం. ఛీ! ఛీ! మనిషిని చూస్తేనే అసహ్యం వేస్తోంది. బుట్టలా బుర్రా, అట్టల్లా బట్టలూ, మీగాళ్ళను రసులు కారుకుంటూ కురుపులు కూడా ఉన్నాయి. ఎనిమిది రూపాయలకు చేస్తుందట. ఒట్టినే చేసినా ఒద్దమ్మా అనుకుంటూ వచ్చేసేను. వాళ్ళెల్లా భరిస్తున్నారో ఏమో – అంత రోత మనిషిని" అంటూ వెలవరించు కున్నారు.

ఆ రాత్రి భోజనాలు చేస్తుంటే మా అత్తగారు అడిగేరు.

"ఏమే పిల్లమ్మా! పోనీ దాన్నే అట్టె పెట్టుకుంటే ఎలాగుంటుందే?" అన్నారు.

నేను మా అత్తగారి పార్లమెంట్ హౌస్‌లో ఆధారపడతగ్గ కంకర సభ్యురాలిని. అంచేత, ఓ నిర్ణయానికి ముందే వచ్చేసిన అన్ని సమస్యల పరిష్కారాల్లోనూ ఆవిడ నా సలహాయే అడుగుతుంటారు. అభిప్రాయ భేదం ఉండి నేను మౌనం వహించినా 'మౌనం అర్థంగీకారం' కాబట్టి ఆవిడగారి పనులు ఆగవు.

"వాళ్ళందరూ చెప్పే కబుర్లు వింటే, వాళ్ళ పనిమనుషులందరి కన్నా మనదగ్గిర మానేసిన సూరమ్మ ముందే – నయమే. సూరమ్మ మీద అంకాలు వెయ్యి రెట్లు మెరుగు. నోరెట్టుకు పడిపోతుందన్న మాటొక్కటి గాని పని శుభ్రంగా చేస్తుంది. మనిషి కడిగిన ముత్యంలా ఉంటుంది. ఎక్కడే వస్తువు బడేసినా పూచికపుల్ల పోదు. ఏదో అనుకున్నాం గాని జీతం కూడా తక్కువే లాగుంది. ఎటొచ్చీ నాగాలు పెడుతుంది. మీ భ్రమకాని యీ రోజుల్లో నాగాలు పెట్టని పనివాళ్ళెవరండీ – అంటారందరూ" అంటూ–

"చూడగా మనమే తొందర పడ్డామేమో – అనిపిస్తుంది నాకు" అన్నారు.

"నువ్వామాట వొప్పుకున్నావు గాని, అదే నువ్వున్న చోట ఉంటే ఛస్తే వొప్పుకోదు. దానికీ, మనకీ తేడా అక్కడే ఉంది" అంది మా ఆడపడుచు.

ఆవిడ మా పార్లమెంటులో ఓ రీతిని ప్రతిపక్ష సభ్యురాలు. ఆవిడతో మా అత్తగారు సాగేటంత వరకూ సానునయంగానే మాటాడుతారు.

"పోనిస్తూ, తెలిసీ తెలియని మనుషులు చేస్తే తప్పులు సరిపెట్టుకోవాలి. తెలిసిన వాళ్ళు కూడా వాళ్ళతో సమానంగా కక్ష పెంచుకుంటే, అది తప్పౌతుంది. అది సిద్ధి కొరుకుతుందని మనం చెప్పు కొరక్కూడదు".

"అదలా అనుకోదు కదా. గతిలేక దాని కాళ్ళు పట్టుకొన్నా మనుకుంటుంది" అంటూ మా ఆడబిడ్డ లిమిట్ దాటేసింది.

"అనుకుంటే అనుకుంటుంది. వశం తప్పినప్పుడు వసుదేవుడంతవాడు గాడిద కాళ్ళు పట్టుకున్నాడట. అదేదో అనుకుంటుందని ఇప్పుడే గంగలో దూకుతాం!" అంటూ ఊ.... రుసరుస లాడిపోయేరు.

ఆవిడ చిరాకు తగ్గేదాకా ఎవరం మాటాడలేదు. తరవాత–

"నేనోమాట చెప్పనా?" అన్నది మా ఆడబడుచు.

ఏమో ఏ పుట్టలో ఏ పామున్నదో అన్నట్టు చూసేం తక్కిన ఇద్దరం.

"అంతకన్నా తలకో పనీ మనమే చేసుకుంటే పోలేదూ? ఇంట్లో నలుగురం ఆడవాళ్ళంవి వున్నాం. ఏం, నలుగురం నాలుగు పనులూ చేసేసుకోలేం?" అంది.

"ఎందుకు చేసుకోలేం – మహరాజులా చేసుకోవచ్చు. కాని, ఈ యింట్లో నలుగురాడవాళ్ళంటున్నావ్, ఆ నలుగురూ ఎవరో చెపతా – వింటాను" అన్నారు అత్తగారు.

"ఏం చిన్న వదిన పుట్టింటి నించి మ(రాదా?"

"ఎందుకు రాదూ? వస్తుంది. కాని ఆవిడా నువ్వూ కూడా ఆడవాళ్ళలోనే లెక్కా అన్నది సందేహం?"

అని జవాబు రాకపోగా–

"మగాళ్ళతో సమానంగా తిన్న కంచంలోనే చేయి కడిగేసుకు లేచిపోతావు నువ్వు. ఏడింటికే మేడెక్కేసి నవల్సట్టుకుంటుందావిడ! ఏమైనా అంటే చదువుకున్నమ్మాయిలు!"

మా ఆడపడుచు పి.యు.సి. చదువుతోంది. తోటికోడలు యస్.యస్.యల్.సి. పాసయ్యింది. నాదీ, మా అత్తగారిదీ వానాకాలపు చదువు. అందుకని ఇంగ్లీషు బదుల్లో తెలుగు పండితుల్లాగా మా అత్తగారు సందు దొరికినప్పుడల్లా ఓ విసురు విసురుతుంటారు.

"మేం నేర్చుకుంటాం మొర్రో అంటే నువ్వే ఒప్పవు కదా!"

"ఓహ్! నేర్చుకుంటారు! నేరకపోయి ఒకసారి పప్పు రుబ్బమన్నాను. శేరుపప్పు రుబ్బి చేతుల్నిండా స్పోటలు రాసుకొని రాత్రల్లా ఊదుకు కూర్చుందిట ఒకావిడ. ఎంగిళ్ళెత్తే అంటే – అదొక్కటి తప్ప ఏ పనైనా చెపుదూ అంటుంది రెండోది".

"అబ్బా! నాకా ఎంగిళ్ళెత్తడమంటే పరమ అసహ్యం సుమీ. గేదిలా వంగి చేతులు అరగదీసుకుంటూ ఊడ్చాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇరవై యేళ్ళయిందన్న మాటే గాని చిన్న చిన్న సదుపాయాలు కూడా మనకింకా అందుబాటులోకి రాలేదు. పై దేశాల్లో అయితే అతి పేద కుటుంబాలక్కూడా అన్నిటికీ మిషన్లుంటాయిట. మరీ దరిద్రులెవరో కొనుక్కోలేరు".

"అక్కడ మగాళ్ళు కూడా ఆడవాళ్ళతో సమంగా వంటింటి చక్కబాట్లు చేస్తుంటారట. వెళ్ళి మీ అన్నయ్యకీ, నాన్నగారికీ కూడా మెడకీ నడ్డికీ, ఆ గుడ్డలేవో కట్టించి తీసుకురా. అప్పుడు నువ్వన్నట్టు నలుగురుం నాలుగు పనులూ చక్కగా చేసేసుకోవచ్చు".

తరవాత సంభాషణ పెడదారి పట్టేసింది.

మా యింట్లో పనిమనిషి లేనిదే పూట గడవదని ఏనాడో తేలిపోయింది. ఇల్లు చిన్నదే అయినా, ముందో లంకంత వాకిలీ, వెనక అంతకు రెట్టింపు వాకిలీ వున్నాయి. అప్పుడెప్పుడో చవగ్గా దొరికిందని, మా మామగారు ఏకం నాలుగు వందల గజాలు కొనేశారట – మా అత్తగారి పీకలమీదకి. మా యింట్లో మేం పెంచుకునేవి పూల మొక్కలే అయినా, మా యిరుగూ పొరుగూ బాదం, నేరేడూ, వేపా అంటూ వెర్రి చెట్లన్నీ పెంచేసేరు. ఆ ఆకూ, పువ్వూ అంతా మా వాకిటే రాలుతుంది.

పైగా యిల్లు వచ్చే పోయే కొంప. యింట్లో కూడా తక్కువ మందిం లేము.

మా అత్తగారంటే – ఆవిడ పెద్దకాలం మనిషి. నాది చూడబోతే కని పెంచే వయసు. ఆడ పనికి ఏం సాగినా మేమిద్దరమే సాగాలి.

నాకు ఒళ్ళు దాచుకోవడం ఏనాడూ అలవాటు లేదు. కాని మా అత్తగారు నేనొక్కదాన్నే పనంతా చేసుకు రావడాన్ని ఒప్పరు. ఆడదానికి యీసులేని చోట మగాడికుంటుంది. పెళ్ళాం మీద ప్రేమ ఒలకబోసే వారికంటే లేనట్టు కనిపించే వారి వల్లే కుటుంబాలు చీలుతాయి – అనేది ఆవిడ సిద్ధాంతం.

దానా దీనా మంచి పనిమనిషి కోసం మేం పడే పాట్లు ఇన్నీ అన్నీ కావు.

పైడమ్మలాటి పనిమనిషి యింకొకత్తె దొరికితే, భగవంతుణ్ణి ఇంకేమీ అడగనే – అంటారావిడ.

పైడమ్మంటే నేను కాపరానికి వచ్చేసరికి మా యింట్లో పనిచేస్తూ ఉండిన మనిషి. నా రాకకి ముందూ వెనకా ఆమె చాలా ఏళ్ళు మా యింట్లో పని చేసింది. ఆమె కొడుకు బాగా చదువుకొని ఏదో పెద్ద ఉద్యోగంలోనే ప్రవేశించడంతో మా యింటికి తిప్పలొచ్చి పడ్డాయి.

పోనీలే, దాని కష్టాలు గట్టెక్కేయి – అంటూనే మంచి పని మనిషి చెయ్యి జారిపోయినందుకు మా అత్తగారు పడే విస విస యింతా అంతా కాదు. అది మానుకున్నాక అరడజను మంది పనిమనుషులు వెళ్ళేరు. ఏ ఒకర్తీ నిండా ఏడాది మన్నలేదు.

"లాభంలేదే పిల్లమ్మా. దీన్నే మంచి చేసుకొని ఎలాగేనా నిలబెట్టుకోవాలి. వయస్సులో ఉన్న పిల్ల. ఆరోగ్యమైన మనిషి. శుచీ శుభ్రం ఎరుగును. అది తోమిన గిన్నెలు మల్లెపువ్వులా ఉంటాయి. తుడిచిన వాకిలి అద్దంలా ఉంటుంది. అంచేత, ఏం చేస్తావో నాకు తెలియదు; అదంతా నువ్వే చూసుకో. సాయంత్రం పని అప్ప చెపుతూ రేపట్నుంచీ రానని చెప్పడానికి పిలుస్తుంది. నేను దాని ఎదట పడను. నువ్వే ఎలాగో సమాధాన పరచు".

–అంటూ తిరుగులేని అత్తగారు – ఆర్డరు వేసేసి హాయిగా నిద్రపోయేరు. నాకు మాత్రం ఆ మధ్యాహ్నం నిద్ర పట్టలేదు.

★ ★ ★

"ఏఁవమ్మోయ్ గిన్నెలు సూస్కోండి" అంటూ అరుస్తోంది అంకాలు.

చదువుతున్న వారపత్రిక పక్కకుపెట్టి పెరట్లోకెళ్ళేను.

సిగలో పువ్వులు, నుదుట చేర్చుక్క, కళ్ళను కాటుక, శుభ్రమైన చీరా రవికా పైట చెరగుతో ముఖాన పట్టిన చెమటా, చేతుల తడీ సుతారంగా సినీమా తారల పద్ధతిలో అద్దుకుంటోంది.

వెనక్కి విరచి కట్టిన చీర కుచ్చెళ్ళు ఇంకా తియ్యలేదు. యెండలో నించుంది.

"నీ మొగుడికేం పనో?" అన్నాను యధాలాపంగా అడిగినట్టు.

"ఆడు నాయరు కొట్టులో పప్పు రుబ్బుతాడు" అంటూ నా కళ్ళలోకి చూసి "ఏం అలా అడిగినా?" అంది అనుమానంగా.

"అబ్బే, వూరికినే, అడక్కూడదా?"

క్షణం సేపు నా మొహంలోకి అట్టే చూసి–

"ఏటో అనుకున్నాను. నువ్వూ సెఁవత కారివేనమ్మా" అంది మొహమాటం లేకండా.

చెప్పొద్దూ – నేను గక్కురుమన్నాను.

"అది కాదో, పువ్వులూ, గివ్వులూ పెట్టి ముస్తాబైతే కంపెనీ జీతాలందే యేమో మొగుడి తో సినీమాకి బయల్దేరుతున్నావనుకున్నాను. ప్రతిదానికీ పెడర్థాలు తీస్తావెందుకూ?" అన్నాను ఏమీ ఎరగని దాన్లా.

అంకాలు – నా మాటలు నమ్మడమా, మానడమా అన్నట్టు చూసి, ఆ క్షణానికి నమ్మేసినట్టే కనబడింది.

"మాకు సినీమాలొకటి – మాపిటికి దప్పికల్లేవుగాని" అని "మీ అత్తగోరు నేఁరా?" అంది – లాలోచీలు మాటాడే మనిషిలా.

"ఏం కావాలి కదా?" అన్నాను, చిన్నాశతో.

"రేవణ్నించి వన్లోకి రాను కదా. జీతానికి ఎప్పుడ్రమ్మంటారో అడుగుదాఁవని".

మాట్లాడుతూ అది తిప్పుకునే తీరు, కళ్ళలో దాస్తున్న పెంకెతనం, చూస్తుంటే – ఆట పట్టిస్తున్నది గాని దానికి మానేసే ఉద్దేశం లేదేమో అనిపిస్తోంది. సరే చూదాం అనుకుంటూ –

"జీతానికేముందిలే – కావలిస్తే ఇప్పుడే ఇచ్చేస్తాను. పని మానేయడానికే ఖాయపరిచేవా?'' అన్నాను కుట్రలో భాగస్వామిలా.

"అయితే యిప్పుడే పడీయండి" అంది – డబ్బు మాటతప్ప తక్కింది వినపడనట్టు.

నేను లోపలికెళ్ళేను. మా అత్తగారు పెట్టెలోంచి పది తీసుకెళ్ళమన్నారు. ఇంటి ఖర్చుకి వాడే డబ్బు నా పెట్టెలోనే ఉంటుంది. పెట్టె తెరిచి అందులో పాతనోటుకి బదులు నే దాచుకున్న డబ్బులోంచి ఓ కొత్త నోటు తీసుకెళ్ళేను. క్షణకాలం అంకాలు కళ్ళలో కనిపించిన వెలుగు చూసి హమ్మయ్య అనుకున్నాను.

ఆ తరవాత–

"నా దెగ్గిర రెండ్రూపాయల్లేవు" అంది – లోకంలో ఉండే విచారమంతా తన నెత్తిమీదే పడ్డట్టూ, ఆ ఒక్క వాక్యంలోనే ఆ విచారమంతా వినిపిస్తున్నట్టూ.

"చిల్లరక్కర్లేదులే ఉంచు" అన్నాను.

అంతే. టప్పున విరిగిపోయింది.

"నా కొద్దమ్మా – నా నుంచుకోను. నా సొమ్మొకళ్ళ మీదుండాలగాని నా నొకళ్ళదుంచుకోను'' అంది ఫెళ్ళుమంటూ.

నాకు గాభరా వేసింది.

"అదికాదో. అదినీ సొమ్మేనో. సూరమ్మకి మేం తొమ్మిదిచ్చే వాళ్ళమా? ఎందుకేనా మంచిదని మా అత్తగారు ఎనిమిదికి బేరమాడేరు. తక్కువిస్తామని ఎక్కువివ్వొచ్చు కాని, ఎక్కువిస్తామని తక్కువివ్వడం న్యాయం కాదు కదా? అసలు నీకు పదిద్దామనే మా యింట్లో అనుకున్నాం" అంటూ ఎంత నమ్మకంగా చెప్పినా లాభం లేకపోయింది.

'ఓలమ్మోలమ్మ! నాకా సెపతావీ కబుర్లు. మీ బుగతమ్మలు ఒప్పుకున్న దొప్పుకున్నట్టు యీడమే గొప్ప.

సూరమ్మకి తొమ్మిదిచ్చీ వోరంటే అంట్లూ, సెంబులూ, వోకిళ్ళూ, కల్లాపులే కాక గదులు కూడ తుడిపించీ వోరు. నాను మణెమ్మగోరక్కడ గదులు కాక ఎనిమిదుచ్చు కుంటున్నానన్తెలిసి' ఆరింటో నాగానే మా యింటానూ' అని ఎనిమిదికి బేరంవాడింది మీ యత్తమ్మ. దేనికీ – గదులు

కూడా తుడమంటే పడదుగుతానని. పడదిగితేనే కదా – నాగాలెదుతోందని నెపవెట్టి ముసిల్దాయిని మానిపించీసారు.

ఇప్పుణ్ణాకు దానికన్నా తక్కువ పన్జేసినందుకు ఓ రూపాయి ఎక్కువిస్తారా!"

– అంటూ నిల్దీసింది.

నాకేం చెప్పడానికీ పాలు పోలేదు.

"అయితే ఎందుకిస్తున్నామంటావు – యీ పది రూపాయలూ?" అంటూ ఆమెనే అడిగేను.

"నాన్సెప్పను. నాన్నీకన్నా సత్తికాలం దాన్నీ! దాన్సంగతేదో మీ అత్తమ్మనే అడుగు" అంటూ–

"ఆ యమ్మ యీ మూఁడ్రోజులూ ఎన్నెన్ని గుమ్మాలెక్కిందో ఎందరెందర్ని వోకాబులు సేసిందో – నీకూ తెల్దు, నాకూ తెల్దు. పాపం!" అంది – జాలి మొహం పెడుతూ.

ఈ మనిషి, ఆవలిస్తే పేగులు లెక్కెడుతుందని ఒత్తినే అన్లేదు మా అత్తగారు.

"సరే, మాకెక్కడా పనిమనిషి దొరక్కే నీకు డబ్బాశ చూపిస్తున్నాం – అనుకో. నీ పని పెంచకండా నువ్వా రెండూ తీసుకోవడంలో నీకొచ్చే ఇబ్బందేఁవిటీ!"

"ముసిల్దాయి – సూరమ్మకో రూపాయిస్తే మీ డబ్బు తరిగిపోద్దనీ మీరిచ్చుకోలేకే మానిపించినారా?"

దానికీ దీనికీ సంబంధం ఏమిటని అడిగి లాభం లేదు. ప్రశ్నకు ఎదురు ప్రశ్న వేయడం నేర్చిన మనిషి. మనసులో విషయం దాచి మసిపూసి మారేడుకాయ చెయ్యడంలో మాకన్నా రెండాకులు ఎక్కువ చదివింది.

"ఇంతకూ యీ పదీ తీసుకుంటావా తీసుకోవా?" అన్నాను చివరి మాటగా.

అంకాలు కళ్ళలో ఓ పెంకె నవ్వు కనిపించింది.

"నాన్తీసుకోను. నా జీతం యెనిమిది. అంత కొక్క పైసెక్కువైనా నాకొద్దు" అంటూ విరిచి కట్టిన కుచ్చెళ్ళు ముందుకు లాగి సరిచేసుకుంటూ "సిల్లర్నేప్పోతే రేపిద్దురు" అంటూ గేటుకేసి నడిచింది.

అలా వెళ్తుంటే ఆమె ఉద్దేశ్యం, పనిలో ఉండడమో ఊడడమో, నేను గ్రహించలేక పోయేను. ఏమైనా ఆమె గుమ్మం దాటితే తిరిగి రావడం అనుమానమే అని గట్టిగా అనిపిస్తోంది. ఏం చెయ్యడానికీ తెలియని స్థితిలో ఉండగా–

"ఇదిగో! మాట" అంటూ మా అత్తగారు బయటకు వచ్చేరు.

అంకాలు ఆగి వెనక్కి తిరిగింది.

మా అత్తగారు ఆమె దగ్గరకి వెళ్ళేరు.

"నేనో మాట అడుగుతాను చెపుతా?" అన్నారు ముందుగా.

ఆమె ఆవేశంతో ఊగిపోయే ముందు అలా మాటాడుతారు.

అంకాలు జవాబివ్వలేదు.

"కాదూ – నిన్ను భయపెడితే నువ్వు జడుసుకోవు. కలియపడదామంటే తిరగబడతావు. పోనీ డబ్బాశకేనా లొంగుతావా అంటే అందుకూ లొంగి రావు. మరి మేమేం చేస్తే నువ్వు దిగొస్తావో చెప్పుమీ".

" ....... ....... ...... ......."

"సూరమ్మని మానిపించేయడం నేరమంటావు. మాది నేరమౌనో కాదో ఆ భగవంతుడికి తెలియాలి. మేమిప్పుడేం చెప్పినా నువ్వు వినే స్థితిలో లేవు. సరే, నేరమే అందాం. దాన్ని దిద్దుకోడానికి యిప్పుడు సిద్ధంగా ఉన్నాం. అందుకు ప్రయత్నం కూడా చేసేం – నీ కళ్ళముందే కదా? తనకిప్పుడు కాళీలేదని చెప్పింది. అదీ నీముందే.

అలాంటప్పుడు ఆ విషయాలన్నీ ఇప్పుడు మళ్ళా తవ్వి తీయడంలో నీ సబువేఁవిటీ?"

" ....... ....... ......"

"చెప్పు నువ్వలా మాటాడకండా ఊరుకోవడం సబవు కాదు. నాకా అరవైయేళ్ళు పైబడ్డాయి. కోడలా ఓపలేని మనిషి. తక్కిన వాళ్ళు చిన్న పిల్లలు. మాకు ఒళ్ళల్లో శక్తుల్లేవనీ ఓపికల్లేవనే కదే మీ మీద ఆధారపడ్డం. ఆధారపడ్డామని కట్టుకట్టి కాల్చుకు తింటారా? ఇది మీకేమేనా న్యాయంగా ఉందీ? కాదు – న్యాయంగా ఉంటే చెప్పు".

" ....... ....... ...... ......."

"నువ్వలా మౌనముద్ర వహిస్తే కుదరదు. అనువులనో మినువులనో అనాలి. ఫలానా కారణం చేత వెళ్ళి పోతున్నానని చెప్పు. ఫలానాలా చేస్తా ఉంటానని చెప్పు. నువు చెప్పినట్టు చేయకపోతే – ఏఁవమ్మా? అను".

మా అత్తగార్ని అక్కడకు దిగజార్చాక చెప్పింది.

"నాకు వారానికి ఒకరోజు శలవుండాలమ్మ" అంది అంకాలు.

సంధికది మొదటి షరతన్నట్టు లేదామాట. కాని మా అత్తగారు దాన్ని అలాగే తీసుకున్నారు.

"సరే తీసుకో, దానితో పాటు పది రూపాయలు జీతం కూడా తీసుకో, దానికీ నీ శలవుకీ ముడి పెట్టను కూడా. కాని నువ్వు మాత్రం ఒక్క మాటివ్వాలి".

ఏఁవిటన్నట్టు చూసింది అంకాలు.

"ఆదివారాలు మాత్రం శలవులు పెట్టకూడదు. ఉండు – ఉండు. నా మాట విను. ఆదివారాలు తప్పించి నీ యిష్టం

వచ్చిన రోజున నువ్వా శలవు తీసుకో. ఎంచేతంటావా – ఆదివారాలు నాకు చుట్టాలూ పక్కాలూ వచ్చి పోతుంటారు. ఆనాడు నేను అంట్లు తోముతూ కూర్చుంటే నాకు నగుబాట్లుగా ఉంటుంది.

అంచేత – నేనెక్కువిస్తానన్న రెం(డ్రూపాయిలూ తీసుకో. నువ్ కావాలనుకున్న వారం శలవు కూడా నిరభ్యంతరంగా నీ యిష్టం వచ్చిన్నాడు తీసుకో. ఆదివారంనాడు మాత్రం నా చుట్టాలు పక్కాలు మధ్య నా పరువు నిలబెట్టు".

– అంటూ గెడ్డం పుచ్చుకోవడం ఒక్కటి తరువాయిగా అంత పనీ చేసేరు, మా అత్తగారు.

ఆవిడ స్థితికే నవ్వు వచ్చిందో, ఆవిడ మాటతీరుకే నవ్వు వచ్చిందో అంకాలు పక పక నవ్వింది. నవ్వుతూ నవ్వుతూ నావంక తిరిగి ఆ నవ్వుతోనే–

"సూడమ్మా యీ యమ్మమాటలు! దాసీ ముండన్నేనట – యీ యమ్మ పరువు నిలబెట్టాలట!" అంది.

ఆ పరువేపాటిదో చూడన్నట్టు, అందుకా ఆ రెండు రూపాయలన్నట్టు – ఉన్నదా మాటల ధోరణి.

అంకాలు నవ్వు తెములుచ్చుకున్నాక మా అత్తగారడిగేరు.

"మరేమంటావు?"

"ఏఁవంటాను! మీ బుగతమ్మలు మా మాటెప్పుడు పడనిచ్చేరు లెండి. నాకు పొద్దోతోంది" అంటూ బయటికి పోయింది.

"రేపాదివారం. వస్తావా?" అన్న మా అత్తగారి కేకకి అంకాలు సమాధానం నాకు వినిపించలేదు.

ఇంట్లోకి వస్తూ మా అత్తగారన్నారు.

"దొంగ భడవ! దాని నైజబుద్ధి ఎలా బైట పెట్టుకుందో చూసేవా? నిన్న పుట్టేనా, ఇవేళ పుట్టేనా – నా కన్ను కప్పడానికి. ఏ యింట్లోనూ లేని ఆదివారం శలవు మా యింట్లోనే దానికెందుకు కావలసి వచ్చిందో తెలుసా? ఆవేళ ఆదివారం గురించి దెబ్బలాడేమని. అదేఁవిటో చూద్దాఁవనే నేనూ ఆదివారం మీద అంతు పట్టుపట్టేను".

– అంటూ లోనికి వెళ్ళిపోయేరు. ★

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక : 7-6-1968)*